https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 121 శనివారం 12-7-2025 పేజీలు : 4 వెల : 2 రూ/..

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## సర్పంచ్ ఎన్నికలకు

# కసరత్తు షురూ

**హైదరాబాద్, జూలై 11,**

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రిమండలి ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపింది, దీంతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ షురూ అయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే సిబ్బంది శిక్షణ, పోలింగ్ కేంద్రాల ఎంపిక పూర్తి చేసింది. ప్రతి మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాల పునర్విభజన గురువారంతో ముగిసింది. 12,777 గ్రామ పంచాయతీలు, 5,982 ఎంపీటీసీ, 585 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది.తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు, అలాగే మండల పరిషత్‌లలో ఎంపీటీసీ స్థానాలకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ నిర్ణయంతో గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లభించనుందని ప్రభుత్వం పేర్కొంది. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండగా.. ఈ పెంపు బీసీల ఆశయాలకు అనుగుణంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఇక రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కసరత్తు వేగవంతమైంది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్ జారీకి నిర్ణయించడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఈ ఆర్డినెన్స్ ఆధారంగా పంచాయతీరాజ్ శాఖ త్వరలో రిజర్వేషన్లపై ఉత్తర్వులు జారీ చేయనుంది. ఆ తర్వాత గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు, పోలింగ్ కేంద్రాలను కూడా ఎంపిక చేసింది.ప్రతి మండలంలో అయిదేసి ఎంపీటీసీ స్థానాలు ఉండేలా పునర్విభజన ప్రక్రియ గురువారంతో ముగిసింది. ప్రస్తుతం ఉన్న గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో 12,777 గ్రామ పంచాయతీలు, 5,982 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ స్థానాలు), 585 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.



ప్రభుత్వం ప్రస్తుతానికి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ముందుగా నిర్వహించి.. ఆ తర్వాత గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఈ వ్యూహాత్మక నిర్ణయం ఎన్నికల ప్రక్రియను సులభతరం చేస్తుందని భావిస్తున్నారు.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

**90% కైవసం చేసుకుంటాం: కోమటిరెడ్డి**

**కాంగ్రెసతోనే న్యాయం: దామోదర**

**బీఆర్ఎస్ పాలనలో అధోగతి: జూపల్లి**



**ఆమనగల్లు, జూలై 11:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, 90 శాతం స్థానాలు కైవసం చేసుకుంటామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందని, ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలంతా కష్టాల నుంచి వైదొలిగి సంతోషంగా ఉన్నారని చెప్పారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల కేంద్రంలో శుక్రవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు పర్యటించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డిలతో కలిసి మాడ్గుల మండల కేంద్రంలో రూ.12.70 కోట్లతో నూతనంగా నిర్మించే 30 పడకల ఆస్పత్రి భవనానికి మంత్రి దామోదర శంకుస్థాపన చేశారు. ఆమనగల్లు మండలం కోనాపూర్ నుంచి మాడ్గుల మండల కేంద్రం వరకు రూ. 45 కోట్లతో చేపట్టే, మాడ్గుల నుంచి అందుగులకు రూ.30 కోట్లతో నిర్మించే బీటీ డబుల్ రోడ్డు విస్తరణ పనులకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. 220 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి జూపల్లి పంపిణీ చేశారు.



# ఇలా ఆర్డినెన్స్.. అలా నోటిఫికేషన్!

## స్థానిక సమరానికి సర్కారు సన్నద్ధం.. సవరణలతో సిద్ధమైన పంచాయతీరాజ్ ఫైలు

- ఏ క్షణమైనా గవర్నర్‌కు పంపే అవకాశం.. సోమవారానికే ఆర్డినెన్స్ వచ్చే చాన్స్
- సీఎంకు బీసీ సంఘాల కృతజ్ఞతలు.. ఆర్డినెన్స్, జీవో ఒకేసారి ఇవ్వాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 11:** స్థానిక ఎన్నికలకు నగారా మోగనుంది. ఈ నెల్లోనే సాధ్యమైనంత తొందర్లోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. బీసీలకు 42 శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించాలని తాజాక్యాబినెట్ సమావేశంలో నిర్ణయించిన నేపథ్యంలో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో పలు సవరణలు చేసి, ఆర్డినెన్స్ రూపంలో గవర్నర్ ఆమోదం పొందాలని, వెను వెంటనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయిం చారు. రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం -2018లోని సెక్షన్ 285(ఎ)లో పలు సవరణలు చేస్తూ ఫైలును రూపొందించారు. దాన్ని ఏక్షణమైనా గవర్నర్‌కు పంపే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గవర్నర్ ఆమోదిస్తే వెంటనే ఆర్డినెన్స్ జారీ అవుతుంది. సోమవారం నాటికే ఆర్డినెన్స్ వస్తుందని అంచనా వేస్తున్నారు. ఆర్డినెన్స్‌తో పాటు సవరించిన చట్టానికి అనుగుణంగా ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబంధించి ప్రత్యేక జీవోను విడుదల చేస్తారు. జీవోలో పేర్కొన్న వివరాల ప్రకారం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. ఈ నెల 25 లోగా రిజర్వేషన్లు ఖరారు చేసి, సెప్టెంబరు 30 లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇప్పటికే హైకోర్టు సూచించింది.ఈ నేపథ్యంలోనే ఆర్డినెన్స్ వచ్చిన రోజునే జీవోను కూడా విడుదల చేయాలని సర్కారు యోచిస్తోంది. ఆ వెంటనే ఎన్నికల ప్రకటన కూడా చేయాలని భావిస్తోంది. వీటిని న్యాయస్థానాల ద్వారా అడ్డుకొనే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉంది కాబట్టి వాటిని నివారించడానికి సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో కేవియట్ పిటిషన్లు వేస్తున్నారు. మొదటి దశలో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించి, తరువాత దశలో సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఎన్ని విడతల్లో నిర్వహించా లనే అంశంపై అధికారులు ఒక నివేదికను రూపొందించి నట్టు తెలిసింది. కాగా, బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంపై బీసీ సంఘాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాయి. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం రేవంత్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆర్డినెన్స్ తో పాటు జీవోను ఒకేసారి విడుదల చేయాలని సూచించారు. న్యాయపరమైన సమస్యల గురించి కూడా చర్చించారు. కోర్టులో ఎవరైనా కేసులు వేసి, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించకుండా ముందు జాగ్రత్తగా హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేవియట్ పిటిషన్‌లు దాఖలు చేయాలని సూచించారు. సీఎం సానుకూలంగా స్పందించారు.

## రెవెన్యూ గ్రామానికో జీపీవో

**మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, జూలై 11:**

రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామ పాలనాధికారి (జీపీవో)ని నియమిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవో, మండలానికి భూ విస్తీర్ణం ఆధారంగా 4 నుంచి 6 మంది లైసెన్స్ సర్వేయర్లను నియ మించబోతున్నామని ఆయన తెలిపారు. ఈనెల 27వ తేదీన శిక్షణ పొందిన సర్వేయర్లకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. 28, 29 తేదీల్లో జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ల్యాబ్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఆగస్టు 12వ తేదీన ఫలితాలు విడుదల చేసి, ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు 40 రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వం నక్షా లేని గ్రామాలను గాలికి వదిలేస్తే సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ఆ గ్రామాలకు పరిష్కారం చూపామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 413 గ్రామాలకు నక్షా లేదని, తొలి విడతలో 5 గ్రామాల్లో రీ సర్వే ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు వివరించారు. ఈ సర్వే ఫలితాలను పరిగణనలోకి తీసుకుని మిగిలిన గ్రామాల్లోనూ రీ సర్వే నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## దళితుల రిజర్వేషన్లు 18శాతానికి పెంచేలా కృషి

**మాల మహానాడులో మంత్రి వివేక్**

ఖైరతాబాద్, జూలై 11: ఎస్సీ వర్గీకరణలోని రోస్టర్ విధానం వల్ల మాలలకు జరుగుతున్న నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఖైరతాబాద్ వాసవి క్లబ్‌లో శుక్రవారం జరిగిన మాల మహానాడు నాయకుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. దళితుల రిజర్వేషన్లు 18శాతానికి పెంచేలా తన వంతు కృషి చేస్తానన్నారు.మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ వర్గీకరణతో మాల విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

## సామాజిక న్యాయం.. కాంగ్రెస్ సిద్ధాంతం

**బీసీలకు 42% రిజర్వేషన్‌తోనే రానున్న ఎన్నికలు**

**త్వరలో 5 లక్షల రేషన్ కార్డుల పంపిణీ**

**14న ప్రారంభించనున్న సీఎం: ఉత్తమ్**



తిరుమలగిరి, జూలై 11


సామాజిక న్యాయం కాంగ్రెస్ సిద్ధాంతమని, బీసీ గణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొనారు. అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించడం.. తమ పార్టీ సామాజిక న్యాయం పాటిస్తుండనడానికి నిదర్శనమన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ బీసీ రిజర్వేషన్‌పై క్యాబినెట్ తీర్మానం చేశామన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్‌తోనే రానున్న ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో 14న సీఎం పాల్గొననున్న బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా 5లక్షల రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నామన్నారు. సన్న బియ్యంతో రూ.3.10కోట్ల మందికి (84శాతం జనాభాకు) అన్నం పెడుతున్నామని, ఇది గొప్ప కార్యక్రమంగా భావిస్తున్నామన్నారు. అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులు ఇస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. కొత్త కార్డులు ఇవ్వడంతోపాటు పాత కార్డుల్లో సభ్యులను చేరుస్తున్నామన్నారు.

# 75 ఏళ్లు పూర్తయితే దిగిపోవాల్సిందే

## ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ స్పష్టీకరణ

- ఈ ఏడాది సెప్టెంబరు 17తో మోదీకి 75 ఏళ్లు
- అదే నెల 11న భాగవత్‌కూ 75 ఏళ్లు - ఇద్దరూ బ్యాగులు సర్దుకోండి.. కాంగ్రెస్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జూలై 11:** నాయకులు 75 ఏళ్ల వయసు రాగానే పక్కకు తప్పుకోవాలంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు మరోసారి రిటైర్మెంట్ రచ్చను రాజేశాయి. భాగవత్ ఈ వ్యాఖ్యలు ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి చేశారా? లేక వచ్చే సెప్టెంబరు నాటికి 75 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న తన గురించి తానే భాగవత్ ఈ ప్రకటన చేశారా? అంటూ విపక్షాలు ఆశ్చర్యపోతున్నాయి. మరోవైపు బీజేపీ, ఆర్ఎసఎస్ మధ్య 2024 ఎన్నికల ముందు మొదలైన ఆధిపత్య పోరు మరింత పాకాన పడిందా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఏమైనా జాతీయ రాజకీయ వర్గాలు, ఆర్ఎసఎస్ వ్యవహారాల పరిశీలకులు తాజా పరిమాణాలను ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇంత చర్చకు కారణమైన ఘటన.. ఆర్ఎసఎస్ సిద్ధాంత కర్త మోరోపంత్ పింగ్లేకు అంకితం చేస్తూ గత బుధవారం జరిగిన పుస్తక ఆవిష్కరణ సభలో చోటుచేసుకుంది. సభలో ఆర్ఎసఎస్ చీఫ్ మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. “75 ఏళ్లు ఒంటిమీదకు వచ్చి శాలువా కప్పించుకున్నామంటేనే, వయసు మీరిందని, బాధ్యతల నుంచి తప్పుకొని, మరొకరికి అవకాశం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని అర్థం చేసుకోవాలి’ అని పింగ్లే అనేవారు” అని తెలిపారు. భాగవత్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయం అనేక సందేహాలకు తావిచ్చింది. వచ్చే సెప్టెంబరు 17వ తేదీతో మోదీ, సెప్టెంబరు 11వ తేదీతో భాగవత్ 75 ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు. వీరిద్దరూ 1950 సెప్టెంబరులో ఆరు రోజుల తేడాతో జన్మించారు. దీంతో ప్రధానిగా దిగిపోవాల్సిన సమయం వచ్చేసిందని మోదీకి భాగవత్ పరోక్ష సంకేతం అందించారని విపక్షాలు వ్యాఖ్యానిస్తున్నాయి. “75 ఏళ్లు పూర్తిచేసుకున్న అద్వాణీ,



మురళీమనోహర్ జోషి, జస్వంత్ సింగ్‌లను బాధ్యతల నుంచి తప్పించేదాకా నరేంద్రమోదీ నిద్రపోలేదు. అదే సూత్రాన్ని ఆయన తనకు వర్తింపజేసుకుంటారా?” అని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) నేత సంజయ్ రౌత్ ప్రశ్నించారు. ప్రధానిగా తన పదేళ్లలో మోదీ నాగ్‌పూర్‌లోని ఆర్ఎసఎస్ కార్యాలయాన్ని తొలిసారి ఈ ఏడాది మార్చిలో సందర్శించినప్పుడు కూడా రౌత్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అప్పట్లో బీజేపీ వాటిని ఖండించింది. బీజేపీ ప్రణాళికలో పదవీ విరమణకు సంబంధించిన నిబంధన లేదని, 2029 వరకు మోదీయే ప్రధానిగా ఉంటారని హోంమంత్రి అమిత్‌షా కూడా స్పష్టం చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ అందజేత



లక్షెట్టిపేట జులై11(మన సమాజం)

శుక్రవారం రోజున లక్షెట్టిపేట మున్సిపాలిటీ 13వ వార్డులో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సురేఖ ఆదేశాలనుసారం ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను అర్హులైన వారికి కాంగ్రెస్ నాయకులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు వస్తాయి అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ చెల్లా నాగభూషణం, మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్, జిల్లా ఉపాధ్యక్షులు చింతల అశోక్, అంకతి శ్రీనివాస్,13వ వార్డు అధ్యక్షుడు సయ్యద్ హాజీ, పెద్ద వెంకటేష్, చిన్న వెంకటేష్, సయ్యద్ హఫీజ్, లగిశెట్టి వెంకటస్వామి, సత్యం, సిద్ధిక్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఆషాడ మాసం గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే




**మహేశ్వరం, జులై 11**

మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా అధ్యక్షురాలు, జమాల్పూర్ సునీత బాలరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఆషాడ మాసం గోరింటాకు వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, మహిళలు అందరినీ ఆప్యాయతతో పలకరించారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై ఆనందంగా గడిపారు.

## మంథనిలో ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు



**మంథని,జులై 11**

కరీంనగర్ ఎంపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను మంథనిలో ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కొండపర్తి సత్య ప్రకాష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్య ప్రకాష్ మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేటర్ నుంచి రాష్ట్ర బిజెపి అధ్యక్షునిగా ఎంపీగా కేంద్రమంత్రిగా అంచలంచలుగా ఎదిగిన బండి సంజయ్ బిజెపి శ్రేణులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. డేరింగ్ అండ్ డాషింగ్ లీడర్ గా పేరుగాంచిన బండి సంజయ్ ని యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బోగోజు శ్రీనివాస్, కూ సత్యనారాయణ, రాపర్తి సంతోష్, వేల్పుల సత్యం నారమళ్ళ కృష్ణ, అశోక్ ఎడ్ల సాగర్ పట్టణ అధ్యక్షులు సబ్బని సంతోష్, రోజా తదితరులు పాల్గొన్నారు.

## చందన్వెల్లి చెరువులో చేపలు మృత్యువాత

**షాబాద్,జులై 11**



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన్వెల్లె చెరువులో చేపలు పెద్ద సంఖ్యలో మరణించాయి. ఈ ఘటనతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మృతుల సంఖ్య వేలల్లో ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. చెరువులో చేపలు చనిపోవడానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది, కానీ కలుషిత నీరు లేదా ఆక్సిజన్ కొరత వంటిసమీపంలో మరిన్ని కంపెనీలకు దగ్గరలో ఉన్నాయి వంటి కారణాలు ఉండవచ్చని భావిస్తున్నారు. అధికారులు చర్య తీసుకోండి మరియు వేగవంతమైన చర్య చేపట్టండి అని స్థానికులు డిమాండ్ చేస్తారు.

# రాజ్యాంగం మర్చిపోయిన రాజ్యాధికారులు!

**రాజ్యాంగం చదివి పదవులు పొందినవారు... అదే రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుంటే ప్రజాస్వామ్యం ఎలా బతకాలి?**

**రాజ్యాంగ ప్రమాణం -నాటకం అయ్యిందా?**

ప్రతి సారి ఓ ఉద్యోగి పదవిలోకి రావాలంటే రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తాడు.
"భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తాను, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, బౌద్ధికతకు కట్టుబడి పనిచేస్తాను" అంటూ చేతులు పైకెత్తి ప్రమాణం చేస్తారు. కానీ అసలు వ్యవహారంలో ఆ ప్రమాణం కేవలం మాటలకే పరిమితమైపోతుందా?
ఇప్పటి పరిస్థితి చూస్తే, ప్రమాణం నాటకం, పదవి వ్యాపారం అన్న భావన జనాల్లో బలపడుతోంది. ఎందుకంటే పాలనలో ఉన్నవారు ప్రజల గళాన్ని ఖంగారు లేకుండా అణిచేస్తుంటే, అది ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడమే.

**రాజ్యాంగం చదివినవారే రాజ్యాంగం తప్పిస్తున్నారా?**

సామాన్య ప్రజలు రాజ్యాంగం చదవకపోయినా, దాన్ని గౌరవించటం తెలుసు. కానీ ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారు - అవే రాజ్యాంగ పాఠాలతో తమ కెరీర్ ప్రారంభించిన వారు - అదే రాజ్యాంగాన్ని విస్మరిస్తున్న తీరే బాధాకరం. ఈరోజు ఓ ఎమ్మార్వో.. ఒక పోలీసు ఆఫీసర్.. ఒక జిల్లా.అధికారి .. ఒక కార్యదర్శి ం అన్నీ రాజ్యాంగబద్ధ పదవులే. కానీ ఈ పదవులను కల్మషపరచే విధంగా, ప్రజల పట్ల తిట్లు, బెదిరింపులు, అక్రమ అరెస్టులు, తప్పుదోవ పట్టించే చర్యలు చేపడుతున్నప్పుడు - ప్రజలు ఏమీ మాట్లాడకూడదా?

**ప్రజల పట్ల అధికారుల నిర్లక్ష్యం - రాజ్యాంగానికి అవమానం**

రేషన్ రాకపోయినా, జీతాలు ఆలస్యమైనా, పింఛన్లు నిలిచిపోయినా- ప్రజలు ఎదుర్కొంటున్న బాధల పట్ల అధికారులకు చులకన భావమే. వాటిని ప్రశ్నించినవారిపై ఎఫ్ఐఆర్‌లు, హుకుం జారీ చేయడం అధికార దుర్వినియోగం మాత్రమే కాదు - రాజ్యాంగ పునాదుల పట్ల ద్రోహం. ప్రభుత్వానికి పని చేసే ఉద్యోగుల లక్ష్యం ప్రజల సేవ కావాలి, ప్రతీకారం కాదు.
ప్రశ్నించినంత మాత్రాన ప్రజలను శత్రువుల్లా చూడడం.. స్వేచ్ఛను అణచేయడం అంటే రాజ్యాంగాన్ని చిత్తుగా కాల్చడం.



**పార్వతి రాజేష్ కుమార్**
**సీనియర్ జర్నలిస్ట్**

**పోలీస్ వ్యవస్థ**
**- రాజ్యాంగానికి లోబడి పనిచేస్తుందా?**

పోలీసులు ప్రజల రక్షణ కోసం ఉన్నారు, వారి స్వేచ్ఛను అణిచేందుకు కాదు. కానీ ఈరోజుల్లో పోలీసు వ్యవస్థను, అధికార యంత్రాంగం - రాజకీయం కోసం ఉపయోగించుకుంటూ, చట్టాన్ని వ్యక్తిగత దుర్మార్గానికి మారుస్తోంది.

**ఒక పత్రికా విలేఖరి నిజాలు రాసినా కేసు**
**ఒక సామాన్యుడు పోరాటం చేసినా కేసు**
**ఒక కార్యకర్త ప్రజల గొంతు వినిపించినా కేసు**
**ఇవి చట్టసమ్మతమా? రాజ్యాంగ సమ్మతమా?**

**రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎవరిది?**

పదవుల్లో ఉన్నవారు ఒక్కొక్కరూ ఒక రాజ్యాంగ దూత. వారు ప్రజలకు న్యాయం అందించాలి. కానీ వారు చట్టాలను ఆయుధాలుగా ఉపయోగించి నిర్బలులను అణిచేస్తే - ఎవరు వారికి అడ్డుకట్ట వేయాలి?
రాజ్యాంగం శాసిస్తుంది - ప్రజలే సర్వాధికారం. కానీ ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యం - ఉద్యోగులే రాజ్యాధికారుల్లా వ్యవహరించి ప్రజలను తమ పాదాల దగ్గర తల వంచింపజేస్తున్నారు.

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోండి - లేదా రాజ్యాంగాన్ని వదిలేయండి**

రాజ్యాంగాన్ని గౌరవించాలంటే, అధికారాన్ని వినయం గా వాడాలి. పదవిలో ఉంటూ ప్రజల మొగ్గు తాకదు, న్యాయం వినిపించదు, బాధ అనిపించదు అంటే - ఆ పదవిని వదిలేయడం మంచిది. ఎందుకంటే అది రాజ్యాంగంపై అపవాదే అవుతుంది. పదవిని గెలుచుకున్నవారు రాజ్యాంగాన్ని గెలుచుకోవాలి. లేకపోతే వారి అభివృద్ధి ఓ పతనం మాత్రమే అవుతుంది. రాజ్యాంగం అంటే పుస్తక పాఠాలు కాదు. అది జీవన విధానం. ప్రజల హక్కుల చాటుగీత. ఆ రాజ్యాంగాన్ని గౌరవించనివారు - ప్రజాస్వామ్యంలో చోటు లేకపోయిన వారే. పదవికి కట్టుబడి ఉండాలంటే, ముందుగా రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. లేకపోతే అది ఒక నాయతీ ముసుగులో ఒలికిన నిరంకుశత్వమే!

# ధర్నా కబ్జా దేవుడికే మొరపెట్టిన జనాలు!

**మంచిర్యాల, జూలై 11,(మన సమాజం) :**



జిల్లాలోని సీసీసీ సీతారాం పల్లి గ్రామంలో దేవుని మాన్యంగా ఉన్న భూమి ఇప్పుడు ఆక్రమణ దుందుడుకులకు నజరాన పడింది. సర్వే నం.6 లో ఉన్న 38 గుంటల భూమి, అదనంగా 3 గుంటల పోటుకరాబ్ భూమిని అయ్యగార్లకు పోషణ కోసం అప్పట్లో ఇచ్చిన భూమి. కానీ ఇప్పుడు ఆ భూముల్ని కొందరు భూభాకాసురులు కన్నేస్తూ, ఆక్రమించాలన్న కుట్రలు చేస్తున్నారని స్థానికులు గట్టిగా అంటున్నారు. దీంతో - భూమిని కాపాడాలన్న ఆశతో కొంతమంది భక్తులు భక్తి మార్గం ఎంచుకున్నారు. నస్పూర్ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం, సీతారాం పల్లి భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి, దేవుళ్లకు వినతిపత్రాలు ఇచ్చారు. "ఈ మాన్యం భూమిని అయ్యగార్లకు దక్కేలా దీవించండి స్వామీ!" అంటూ మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బెర సత్యనారాయణ, మేడం తిరుపతి, ఆకునూరు సంపత్, తిరుమలరావు, తొట దుర్గాప్రసాద్, మండల క్రాంతి, కట్కూరు సంపత్, కాటంరాజు, కందుల ప్రశాంత్, బండారి తిరుపతి, ఇరుగుల వంశీ, ఎండి సాజిద్ తదితరులు పాల్గొన్నారు.దేవుని మాన్యమేనన్న భూమికి కూడా భూబాబోయ్‌లు తలపెట్టే స్థితికి వచ్చారంటే - ఇది భక్తులకే కాదు, సమాజానికే అవమానం. "దేవుడి పేరు చెప్పుకుంటూ భూములు కొట్టేసే రోజులు వచ్చాయా?" అని మండిపడుతున్నారు స్థానిక ప్రజలు. చట్టం పనిచేయకపోతే - దేవుడు తప్పనంటూ, ప్రజలు పూజల పేరుతో పోరాటానికి అడుగులు వేస్తున్నారు.

**భూమి దేవునిదైతే... హక్కు అయ్యగార్లదే!**

భక్తి మార్గంలో కూడా భూకబ్జాదార్లకు గట్టి బుద్ధి చెప్పాలంటూ - ఊరి ప్రజల నినాదం మార్మోగుతోంది.

# శంకుస్థాపనకే పరిమితమైన చర్ల డిగ్రీ కళాశాల

**చర్ల లో డిగ్రీ కళాశాల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు వినతిపత్రం అందజేత**

**చర్ల / జులై 11**

చర్ల మండలం భద్రాచలం నియోజకవర్గానికి సెంటర్ పాయింట్ గా ఉంటుంది అలాంటి చర్ల మండలానికి ఎన్నో ఏళ్లు పోరాడితే కానీ 2019లో డిగ్రీ కాలేజీ శంకుస్థాపన జరిగింది. కానీ ఇప్పటివరకు దానికి నిధులు సాంక్షన్ చేయలేదు బిల్డింగును కట్టలేదు క్లాసులు ప్రారంభించలేదు పేరుకు మాత్రం ఏజెన్సీలో విద్యారంగా అభివృద్ధి అని పెద్దపెద్ద ప్రకటనలు చేసిన పాలకులు ఏజెన్సీనీ విస్మరించాలన్న విషయం కండ్లకు కట్టినట్టుగా కనిపిస్తుంది అని ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు ముసలి సతీష్ అన్నారు. చర్ల మండల పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ కి డిగ్రీ కాలేజ్ బిల్డింగ్ పై వినతిపత్రం సమర్పించడం జరిగింది. ముసలి సతీష్ విషయం తెలియజేస్తూ చర్ల మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమని ఈ ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యాలు ఎక్కువగా ఉండవని కాబట్టి ఇంటర్మీడ యట్ తోటి పదవ తరగతితోనే విద్యార్థులు విద్యను మధ్యలోనే ఆపివేస్తున్నారని చర్లలో డిగ్రీ కాలేజీ నిర్మిస్తే విద్యార్థులు చదువులు చదువుకోడానికి ఆస్కారం ఉంటుందని వారు అన్నారు . స్థలం చూపించిన ప్రభుత్వం నిధులు సాంక్షన్ చేసిన కట్టడానికి ఎందుకు వెనకాడుతున్నారు అని అధికారులు పాలకులే చెప్పాలని వారి ప్రశ్నించారు. మీరైనా ఈ జిల్లా ప్రథమ పౌరుడు గా చొరవచూపి రాబోయే తరానికి కాబోయే భావి భారత పౌరుల భవిష్యత్తు కోసం ఇక్కడ సాంక్షన్ అయిన డిగ్రీ కాలేజ్ ని తక్షణమే పునర్నిర్మాణం చేపట్టి లెక్చరర్ పోస్టులు కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తారని ఏజెన్సీలో ఉన్న విద్యార్థులకు పైవిద్య అభ్యసించే విధంగా చూస్తారని పివైఎల్ గా కోరుతున్నాం అని అన్నారు

# అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**హుజురాబాద్, జమ్మికుంట, సైదాపూర్ మండల కమిటీల నియామకం**

**ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య**



**హుజురాబాద్, జూలై 11**

దేశంలో ప్రతి పౌరుడు తమ హక్కులను బాధ్యతలు తెలుసుకొని అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఇమ్మడి ప్రణయ్ అధ్యక్షతన హుజురాబాద్ పట్టణంలో హుజురాబాద్, జమ్మికుంట, సైదాపూర్ మండల కమిటీల నియామక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు న్యాయవాది సుంకనపల్లి రాము, రాష్ట్ర కమిటీ సభ్యులు గుర్రాల సదన్న, రావుల రాజేశం, పాక శ్రీనివాస్ యాదవ్, పరకాల సమ్మయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షురాలు పులుగు లతారెడ్డి తదితరులు హాజరైన ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య మాట్లాడుతూ రోజురోజుకు అవినీతి రాజ్యమేలుతుందని, దేశ సంపద, ప్రజాధనం అవినీతి అక్రమార్కుల చేతిలో దుర్వినియోగం అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బలమైన ప్రజా పోరాటాల ద్వారానే దేశాన్ని అవినీతిపరుల నుండి కాపాడుకోగలమని ఆయన అన్నారు. అవినీతి అక్రమార్కులను సమాజంలో దోషులుగా చూపించే కార్యచరణను జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రూపొందించిందని ఆయన పేర్కొన్నారు. అవినీతి రహిత సమాజం కోసం తమ సంస్థ చేస్తున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యులు రావుల రాజేశం, పాక శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనపై స్పందించడమే కాకుండా మంచిని పెంచడం మానవత్వాన్ని పంచడం వంటి కార్యక్రమాలతో పాటు భారత రాజ్యాంగ చట్టాలను అనుసరించి పెన్ను పేపర్ ను ఉపయోగించి దేశంలో మార్పు, చైతన్యం కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ఈ ప్రయత్నంలో 14 రాష్ట్ర కమిటీలు మన రాష్ట్రంలో 33 జిల్లా కమిటీల నిర్మాణం పూర్తి చేశామని వారు తెలిపారు. అనంతరం జిల్లాలోని పలు మండల కమిటీల ప్రతినిధులకు నియమక పత్రాలు అందించారు.

**హుజురాబాద్ మండల కమిటీ అధ్యక్షురాలుగా:**
తాళ్లపెల్లి దేవేంద్ర ప్రధాన కార్యదర్శిగా: సబ్బని మాధవి ఉపాధ్యక్షులుగా: జంపాల సువర్ణ, ఆకునూరి గణేష్ అధికార ప్రతినిధిగా: కొడిమ్యాల పవన్ కుమార్ హుజురాబాద్ పట్టణ అధ్యక్షురాలుగా: మల్లెల సరిత

**జమ్మికుంట మండల కమిటీ**
అధ్యక్షురాలుగా: ఇటికాల స్వరూప, ప్రధాన కార్యదర్శిగా: ఆరె వసంత

**జమ్మికుంట పట్టణ కమిటీ**
అధ్యక్షురాలుగా: మధిరే హేమలత, ప్రధాన కార్యదర్శిగా: గూడెపు లలిత ,ఉపాధ్యక్షురాలుగా: మౌనిక

**సైదాపూర్ మండల కమిటీ**
అధ్యక్షురాలుగా: మూల భూలక్ష్మి, ఉపాధ్యక్షులుగా: తలారి రాము ,ప్రధాన కార్యదర్శిగా: జంగ కవిత తదితరులకు నియామక పత్రాలు అందించి సంస్థ విధివిధానాలకు అనుగుణంగా కృషి చేయాలని పేద ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు.

# 22 మంది మావోయిస్టులు లొంగుబాటు



**చర్ల,జులై 11**

తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ నారాయణపూర్‌లో 22 మంది నక్సలైట్లు లొంగిపోయారు ఒకవైపు, రాష్ట్రంలో నక్సలిజానికి వ్యతిరేకంగా భద్రతా దళాల ప్రచారం నిరంతరం జరుగుతుండగా, మరోవైపు, ప్రభుత్వ పునరావాస విధానం కూడా ప్రభావం చూపుతోంది. దీనికి సంబంధించి, శుక్రవారం నారాయణపూర్‌లోని 22 మంది నక్సలైట్లు పోలీసు సూపరింటెండెంట్ ముందు లొంగిపోయారు, వీరిలో 8 మంది మహిళా నక్సలైట్లు కూడా ఉన్నారు. ఈ నక్సలైట్లందరూ అబుజ్మద్ ప్రాంతంలో చురుగ్గా ఉన్నారు మరియు అమ్దాయి, నెల్నార్ , కుతుల్ ఏరియా కమిటీతో సంబంధం కలిగి ఉన్నారు. సమాచారం ప్రకారం, పోలీసుల నుండి నిరంతర ఒత్తిడి, ఎన్‌కౌంటర్లలో సీనియర్ నక్సలైట్ నాయకులు మరణించడం జన జీవన స్రవంతిలో చేరాలనే కోరిక కారణంగా, ఈ నక్సలైట్లు లొంగిపోవాలని నిర్ణయించుకున్నారు. భద్రతా దళాల ప్రకారం, ఈ నక్సలైట్లు చాలా కాలంగా ఆ సంస్థలో ఉన్నారు మరియు ఐ ఈ డి లను అమర్చడం, పోలీసుల కదలికలను గుర్తించడం మరియు జనతా ప్రభుత్వాన్ని విస్తరించడం వంటి కార్యకలాపాలలో పాల్గొన్నారు. 2025 సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 110 మంది నక్సలైట్లు లొంగిపోవడం గమనించదగ్గ విషయం. లొంగిపోయిన ఈ 22 మంది నక్సలైట్లపై మొత్తం రూ. 37.50 లక్షల రివార్డును ప్రకటించారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రోత్సాహకంగా రూ. 50,000 చెక్కును అందించారు. నక్సల్ నిర్మూలన విధానం కింద అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను వారికి అందిస్తారు.

# పూసుగుప్పలో మొబైల్ హాస్పిటల్ ప్రారంభం

**అంబులెన్సు సేవలు ప్రారంభం**

**ఈ కార్యక్రమం లో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ,జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**






**చర్ల, జులై 11**

చర్ల మండలంలోని ఛత్తీస్గడ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన పూసుగుప్పలో శుక్రవారం మొబైల్ హాస్పిటల్, అంబులెన్స్ సేవలను ప్రారంభించడం జరిగింది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తో పాటు, జిల్లా కలెక్టర్ జితేష్.వి పాటిల్,ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ లు పాల్గొన్నారు. స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ నిధుల ద్వారా విడుదలైన కోటి రూపాయల వ్యయంతో ఈ మొబైల్ హాస్పటల్ ను నిర్మించడం జరిగింది. చర్ల మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజల సంక్షేమం కోసం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ సారథ్యంలో పోలీస్ శాఖ విశేష సేవలను అందిస్తుందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఈ సందర్భంగా అన్నారు. పూసుగుప్ప గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎవరికైనా అత్యవసర చికిత్స అవసరమైతే భద్రాచలం,కొత్తగూడెం పట్టణాలకి వెళ్లడానికి ఒకప్పుడు సరైన రహదారి కూడా లేదని,కానీ ఇప్పుడు ఇదే పూసుగుప్ప గ్రామానికి చర్ల నుండి అరగంట వ్యవధిలోనే చేరుకునే విధంగా రహదారిని మరియు ఇప్పుడు ఈ హాస్పిటల్ ని ప్రారంభించడంలో చర్ల పోలీసుల కృషి ఎంతగానో ఉందని అన్నారు. ఆదివాసీ ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి సేవలను పరిసర ప్రాంతాల ప్రజలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అందవలసిన సంక్షేమ పథకాలు కానీ,అభివృద్ధి కార్యక్రమాలు గానీ ఆదివాసీ ప్రజలకు అందజేయడంలో జిల్లా పోలీసుల కృషి అభినందనీయం అన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు విద్య,వైద్యం,రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా జిల్లా అధికార యంత్రాంగం పనిచేస్తుందని తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున పోలీస్ శాఖ ఏజెన్సీ ప్రాంతవాసులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఎలాంటి సమస్యలున్నా సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించడంలో స్థానిక పోలీసు అధికారులు ఎల్లప్పుడూ ఆదీవాసీ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. సరిహద్దు చత్తీస్గడ్ రాష్ట్ర గ్రామాలైన రాంపురం,భీమారం గ్రామాల ప్రజలు కూడా ఈ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం అంబులెన్స్ వాహన సేవలను ప్రారంభించారు. ఇటీవల పూసుగుప్ప నుండి రాష్ట్ర సరిహద్దు వరకు నూతనంగా నిర్మితమైన బీటి రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్,చర్ల ఇన్స్పెక్టర్ రాజు వర్మ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్స్ చెన్నూరి శ్రీనివాస్, ఈ . శ్రీనివాస్, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ , ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# కలెక్టర్‌ను కలిసిన సమాచార హక్కు చట్టం సాధన కమిటీ



**హన్మకొండ, జులై 11**

శుక్రవారం నాడు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ హన్మకొండ జిల్లా నూతన కార్యవర్గం జిల్లా కలెక్టర్ స్నేహ శబారిష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మీసాల విజయ్ ప్రజల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ లక్ష్యాలను, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా తమ కమిటీ ఎలా పనిచేస్తుందో కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా అధ్యక్షులు మీసాల విజయ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు బొల్లం విజయ్, హన్మకొండ జిల్లా సెక్రటరీ కొంగంటి రాజ్‌కుమార్, హన్మకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను సదానందం, కమలాపూర్ మండలం అధ్యక్షులు కోవరాజు సాగర్, పెనుకుల మోహన్, నరేష్, మహమ్మద్ గౌస్ ఖాన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాయకల్ప అవార్డుకి ఎంపికైన చర్ల సిహెచ్‌సి

**హర్షం వ్యక్తం చేసిన కలక్టర్, ఎమ్మెల్యే ఐ టి డి ఏ పీ ఓ ,డీసిహెచ్ ఎస్**

**చర్ల,జులై 11**




ఉత్తమ ప్రమాణాలు వసతులు కలిగిన ఆసుపత్రులకు ఇచ్చే కాయకల్ప ఆవార్డు చర్ల, ప్రభుత్వ ఆసుపత్రి ఎంపికైనట్లు ఆసుపత్రి సూపరౌండ్ డాక్టర్.సాయి వర్ధన్ తెలిపారు. ఆసుపత్రి కొత్తదైనప్పటికి కో డాక్టర్ స్టైంత్ పూర్తీ స్థాయిలో లేనప్పటికీ 30 పడకలకి సంబందించ బిల్డింగ్ లేనప్పటికి ఆసుపత్రి సిబ్బంది పట్టుదలతో డీసిహెచ్ఎస్ ప్రత్యేక పర్యావేక్షణలో చాలా కష్టపడి పనిచేసారు. డీసిహెచ్ఎస్ డాక్టర్ . రవిబాబు భద్రాచలం సూపర్- డెండ్ డాక్టర్ .రామకృష్ణ సూచనతో ప్రత్యేకంగా నియమించిన హెడ్ నర్స్ రాజ్యాలక్ష్మి ఈ కాయకల్ప ఎసెస్ మెంట్ సంబందించిన ఏర్పాట్లు చూసారు. ఈ ఆవార్డు రావడం చారిత్రాత్మక ఘట్టం అని, ఈ అవార్డుతో ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ఈ అవార్డు ద్వారా అసుపత్రి సిబ్బంది మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేసి ఈసారి స్టేట్ అవార్డు సాదించడానికి సాయశక్తుల ప్రయత్నిస్తామని సూపర్ డింట్ డాక్టర్ . సాయి వర్ధన్ తెలిపారు.ఇంత కష్టపడ్డ సిబ్బందిని డీసిహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు అభినంధించారు.

## బట్టిగూడెంలో ఆరోగ్య శిబిరం

**చర్ల, జులై 11**



శుక్రవారం చర్ల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సత్యనారా యణపురం పరిధిలో గల వలస ఆదివాసి గిరిజన గ్రామమైన బట్టిగూడెం గ్రామంలో లో హెల్త్ క్యాంపు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగింది. అనంతరం గృహ సందర్శన చేసి, గ్రామానికి వచ్చే వారు, ఛత్తీస్గఢ్ నుంచి వచ్చే వారి నుండి రక్తనమూనాలను సేకరించాలని, వారి నుండి మలేరియా మనకు సోకే అవకాశం ఉన్నందున, జాగ్రత వహించాలని మరియు పరిసరాలు పరిశుభ్రత పాటించాలని,నీటి నిల్వలు లేకుండా చూసుకో వాలని, దోమ తెరలు వినియోగించు కోవాలని, పరిశుభ్రమైన మంచి నీరు ను తీసుకోవాలని నీటి నిల్వలలో యాంటి లార్వా టేమిఫోస్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ .నగేష్ ,టి . బాబురావు, హెచ్ఈఓ కె. తిరుపతమ్మ,యమ్ పిహెచ్‌యస్‌టి. వేణు,హెల్త్ అసిస్టెంట్ కె .విజయక్ష్మి, యమ్ పిహెచ్ఏకె తిరుపతమ్మ ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా, పాన్ షాపుల్లో తనిఖీలు

**100 డయల్ ద్వారా డ్రగ్స్,గంజాయి సమాచారాన్ని అందించండి**

**ఎస్ఐ సాయికృష్ణ**

**చిగురుమామిడి,జులై 11**



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఎస్ఐ సాయి కృష్ణ ఆధ్వర్యంలో ర్యాంబో డాగ్ తో డ్రగ్స్ గంజాయి కోసం మండలంలోని కిరాణా షాపులు మరియు పాన్ షాపులు క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. ఇక మీదట మండలంలోని అనుమానం ఉన్న అన్ని షాపులు చెక్ చేయబడును. గంజాయి సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్ గాని 100 డయల్ ద్వారా గాని చిగురుమామిడి పోలీసులకు తెలియజేయగలరు. మీ సమాచారాన్ని గోపిగా ఉంచబడునని తెలియజేశారు.

# ఓటీటీ హిట్.. ఆత్మావలోకనం



తారాగణం : రీతూ వర్మ, సూర్య వశిష్ట, సుబ్బరాజు, కోవై సరళ, సోనియా సింగ్, శివ కందుకూరి తదితరులు, దర్శకత్వం : బి.కిషోర్

కొందరంతే.. కంఫర్ట్ జోన్‌లోనే కాలం గడుపుతుంటారు. భూగోళం బద్దలైనా.. ఆ బాక్స్ దాటి బయటికి రారు. అలా.. ఇంటినే కంఫర్ట్ జోన్‌గా భావించి బతికే అమ్మాయి కథే.. 'దేవిక అండ్ డానీ'. అయితే, అనుకోని పరిస్థితుల్లో ధైర్యంగా మరో ప్రపంచంలోకి అడుగుపెట్టి.. తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటుంది.

కామెడీ, హారర్, రొమాంటిక్, భావోద్వేగ అంశాలతో మొత్తం ఏడు ఏపిసోడ్లుగా రూపొందిన తెలుగు వెబ్‌సిరీస్ ఇది. ఆంధ్రప్రదేశ్‌లోని రామాపురం అనే పల్లెలో.. ఈ కథ మొదలవుతుంది. దేవిక (రీతూ వర్మ) ఓ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా పనిచేస్తుంటుంది. చాలా నెమ్మదస్తురాలు. ఇల్లే ప్రపంచం. జగన్నాథం అలియాస్ జగ్గీ (సుబ్బరాజు) చాలా పొసెసివ్‌గా ఉంటాడు. తన ప్రవర్తనతో దేవికతోపాటు చుట్టుపక్కల వారినీ ఇబ్బంది పెడుతుంటాడు. తండ్రి మాట జవదాటని దేవిక.. జగ్గీతో పెళ్లికి సిద్ధమవుతుంది. అదే సమయంలో.. ఊహించని విధంగా ఆమె జీవితంలోకి డానీ (సూర్య వశిష్ట) అనే ఒక అజ్ఞాతవ్యక్తి వస్తాడు. అనతి కాలంలోనే ఇద్దరిమధ్య అనుబంధం ఏర్పడుతుంది. జగ్గీ, డానీ.. ఇద్దరిలో ఎవరిని పెళ్లి చేసుకోవాలనే సందిగ్ధంలో పడిన దేవికకు.. మరో ట్విస్ట్ ఎదురవుతుంది. ఆ ట్విస్ట్ ఏంటి? దానివల్ల దేవిక జీవితంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయి? అసలు డానీ ఎవరు? అతని గతం ఏమిటి? అతను దేవికను ఏ సహాయం చేయమని కోరుతాడు? ఆ సహాయం చేసే క్రమంలో దేవికకు ఎదురైన సవాళ్లేంటి? వాటిని దాటుకొని.. దేవిక అనుకున్నది సాధించిందా? అనే ఆసక్తికర అంశాలతో ఈ సిరీస్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది.



# కథ వినగానే కన్నీళ్లొచ్చాయి!

'మ్యాడ్' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును దక్కించుకుంది అనంతిక సనీల్‌కుమార్. ఈ భామకు నృత్యంతో పాటు బ్లాక్‌బెల్ట్‌లో కూడా ప్రవేశం ఉండటం విశేషం. ఆమె ప్రధాన పాత్రలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన '8వసంతాలు' చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడు. ఈ సందర్భంగా శనివారం అనంతిక విలేకరులతో సినిమా విశేషాలను పంచుకుంది. ఈ సినిమాలో తాను శుద్ధి అయోగ్య అనే రచయిత పాత్రలో కనిపిస్తానని, తనకుమార్షల్‌ఆర్ట్స్‌నేపథ్యం కూడా ఉంటుందని చెప్పింది. 'స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రమిది. ఓ అందమైన ప్రేమ కథా చిత్రం చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ సినిమాతో కుదిరిం ది. ఈ కథ విన్నప్పుడే భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నా. నేను కోరుకున్న ప్రతీ అంశం ఈ కథలో ఉంది. ప్రేక్షకులకు ఓ జీవితాన్ని చూసిన అనుభూతి కలుగుతుంది. ఈ సినిమా కోసం నేను కళరి అనే ఫైట్ కూడా నేర్చు కున్నా' అని అనంతిక తెలిపింది. రాజకీయ నాయకురాలు కావాలన్నది తన ఆశయ మని, అందుకే న్యాయ విద్యను అభ్యసిస్తున్నానని, అయితే తనకు 40 ఏళ్లు వచ్చాకే పాలిటిక్స్‌లోకి అడుగుపెడతానని నవ్వుతూ సమాధానమిచ్చిందీ భామ.




# సీక్వెల్‌ను ఊహించలేను కాజోల్

బాలీవుడ్ ఐకానిక్ చిత్రం.. దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే! ఈ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచన ఏమాత్రం లేదని అంటున్నది అగ్రతార కాజోల్. రాజ్-సిమ్రన్ కథను కొనసాగించకపోవడమే మంచిదని అంటున్నది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాజోల్.. 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే' సినిమా సీక్వెల్‌పై తన అభిప్రాయాన్ని పంచుకున్నది. "డీడీఎల్‌జే-2ని ఊహించలేను. రైల్వే స్టేషన్ నుంచి రైలు బయల్దేరిన తర్వాత ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఎవరూ ఉత్సాహం చూపించడం లేదు. రాజ్-సిమ్రన్.. తమ పిల్లల డైపర్ల కోసం గొడవ పడటం కూడా చూడాలని అనుకోవడం లేదు. అందుకే.. మేము కూడా ఈ ఐకానిక్ సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలని అనుకోవడం లేదు" అంటూ చెప్పుకొచ్చింది. "నిజానికి.. ఆ సినిమా క్లయిమాక్స్ అద్భుతంగా ఉంటుంది. ఆ ప్రేమజంట జీవితం ఎలా ఉంటుందో.. ప్రేక్షకుల ఊహకే వదిలేశాడు దర్శకుడు. ప్రేక్షకులు కూడా.. వాళ్లు ఎప్పటికీ సంతోషంగా జీవిస్తారనే కోరుకుంటారు" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఇక తాను షారుక్‌తో కలిసి నటించిన మరో బ్లాక్‌బస్టర్ సినిమా.. 'కుచ్ కుచ్ హోతా హై' సీక్వెల్‌పైనా స్పందించింది. "ఆకాలం వేరు. ప్రజలంతా శాశ్వతమైన ప్రేమను నమ్మిన యుగం అది. నేటికాలంలో అలాంటి సినిమాను తిరిగి సృష్టించడం చాలా కష్టం" అని చెప్పింది. షారుక్ ఖాన్ %-% కాజోల్ జంటగా 1995లో వచ్చిన దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే సినిమా.. బాలీవుడ్ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీల్లో ఒకటిగా నిలిచింది. రన్నింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు సృష్టించింది. 1995 అక్టోబర్ 20న విడుదలైన ఈ చిత్రం.. ముంబైలోని 'మరాఠా మందిర్ థియేటర్'లో ఇప్పటికీ ప్రదర్శితమవుతూనే ఉండటం విశేషం! ప్రఖ్యాత దర్శక నిర్మాత యశ్ చోప్రా తనయుడు ఆదిత్య చోప్రా ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. ఇక కాజోల్ సినిమాల విషయానికి వస్తే.. ఆమె నటించిన హర్రర్ చిత్రం 'మా' విడుదలకు సిద్ధంగా ఉంది. విశాల్ ఫురియా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కాజోల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. రోనిత్ రాయ్, ఇంద్రనీల్ సేన్‌గుప్తా, ఖెరిన్ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# బాధ్యతలు.. భావోద్వేగాలు!

భారతీయ సినీచరిత్రలో కరణ్ జోహార్‌ది ప్రత్యేక స్థానం. దర్శకుడిగా, నటుడిగా, నిర్మాతగా,



వ్యాఖ్యాతగా ఆయన ప్రస్థానం అసామాన్యం. 'తండ్రి'గానూ.. ఆయన ప్రయాణం ఎంతో విభిన్నం. సరోగసి ద్వారా కవలలకు జన్మనిచ్చిన కరణ్.. 'ఫాదర్స్‌డే' సందర్భంగా తన పాడ్‌కాస్ట్‌లో ఓ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాడు. ఆధునిక పేరెంటింగ్, కుటుంబ వ్యవస్థ, పిల్లలను పెంచడంలో ఉండే బాధ్యతలు, భావోద్వేగాలను ఈ సింగిల్ ఫాదర్ తన అభిమానులతో పంచుకున్నాడు. తన కవలలు యష్-రూహి.. తాము ఎలా పుట్టామని అడిగితే.. 'మీరు నాన్న గుండెలోంచి వచ్చారు' అని కవితాత్మకంగా చెబుతాడట. అయితే, వాళ్లు పెద్దయ్యాక ఈ సమాధానం సరిపోదనీ, వాళ్లు ఈ ప్రపంచంలోకి ఎలా వచ్చారో, సమయం వచ్చినప్పుడు తప్పకుండా చెబుతానని అంటున్నాడు. పేరెంటింగ్ అంటే నిజం చెప్పడం.. నిజాయతీగా ఉండటం అంటున్నాడు. ఇక పిల్లలను తన తల్లి సంరక్షణలో పెంచడం.. తన జీవితంలో తీసుకున్న అత్యుత్తమ నిర్ణయమని చెబుతున్నాడు. "ఒంటరి తండ్రిగా కవలలను పెంచడం అంత సులభం కాదు. కానీ, వారిని మా అమ్మ దగ్గర పెంచడం నా జీవితంలో నేను తీసుకున్న ఉత్తమ నిర్ణయం" అని కరణ్ జోహార్ చెప్పుకొచ్చాడు. ఇక కుటుంబ వ్యవస్థ గురించి తన అభిప్రాయాలను పంచుకుంటూ.. "అందరూ పరిపూర్ణ కుటుంబంలోనే పుట్టలేరు. కానీ, కొందరు అదృష్టవంతులు మాత్రమే సంపూర్ణ కుటుంబాన్ని నిర్మించుకుంటారు. నేనుకూడా అలాంటి అదృష్టవంతుణ్నే అని భావిస్తున్నా! గౌరీ ఖాన్, ఫరాఖాన్, నేహా ధూపియా, శ్వేతా బచ్చన్, కాజల్ ఆనంద్.. ఇలా నా స్నేహితులంతా నా కుటుంబసభ్యులే! నాకు తోబుట్టువులు లేరు. వీళ్లే నాకు దొరికిన తోబుట్టువులు!" అంటూ భావోద్వేగానికి గురయ్యాడు. తన పిల్లలకు 'తల్లి ప్రేమ'కు దూరంగా ఉంటున్నామనే ఊహకూడా రాదనీ, వారిపై తన తల్లితోపాటు తన మిత్రబృందం కూడా అంతులేని ప్రేమను కురిపిస్తుందని అంటున్నాడు. ఇక సినిమాల విషయానికి వస్తే.. బీటౌన్‌కు సరికొత్త ప్రేమకథా చిత్రాలను పరిచయం చేశాడు కరణ్. షారుక్ ఖాన్, కాజల్ జంటగా.. 1998లో వచ్చిన 'కుచ్ కుచ్ హోతా హై' దర్శకుడిగా కరణ్ మొదటి సినిమా. ఆ తర్వాత కభీ ఖుషి కభీ గమ్, మై నేమ్‌ఈజ్ ఖాన్, స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్, బాంబే టాకీస్, ఘోస్ట్ స్టోరీస్ వంటి అనేక విజయవంతమైన చిత్రాలను ఆయన తెరకెక్కించాడు.